సమస్యల చెంత.. వారసంత

- రోడ్డుపైనే చిరువ్యాపారుల విక్రయాలు
- సారంగపూర్‌లో వాహనదారులకు తిప్పలు
- మార్కెట్‌యార్డులో నిర్వహించాలని వేడుకోలు

సారంగపూర్: నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారికి ఇరువైపులా మండలకేంద్రంలో నిర్వహించే వారసంతతో ప్రజలు, చిరువ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం రోజున వారసంత నేపథ్యంలో రోడ్డుపై రద్దీ నెలకొనడంతో వాహనాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. సంత కారణంగా గ్రామపంచాయతీకి ఏటా ఆదాయం సమకూరుతోంది. సారంగపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వారసంతను నిర్వహించాలని స్థానికులు కోరుతున్నా.. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.

మార్కెట్ యార్డులో స్థలమున్నా..

వారసంత నిర్వహణకు సారంగపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో స్థలం ఉన్నా.. అందులో వారసంత నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. రోడ్డుపైనే సంత నిర్వహిస్తుండటంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ప్రతి ఏడాది వారసంత తైబజారు వసూలుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తారు. ఈక్రమంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి వారసంత నిర్వహణకు వేలం నిర్వహించగా గ్రామపంచాయతీకి రూ.91వేల ఆదాయం సమకూరింది. వేలం దక్కించుకున్న వ్యక్తి సంతలో దుకాణాలను ఏర్పాటు చేసుకునే చిరువ్యాపారుల నుంచి ఒక్కో దుకాణానికి రూ.20 నుంచి రూ.50 వసూలు చేస్తుంటారు.

కానరాని సౌకర్యాలు..

గ్రామపంచాయతీకి అదనంగా ఆదాయం వస్తున్నప్పటికీ సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. వారసంత నిర్వహించిన మరుసటిరోజు అంటే శనివారం పంచాయతీ కార్మికులు వచ్చి పరిసరాలు శుభ్రం చేయడం మినహా తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించడం లేదని చిరువ్యాపారులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వారసంతను వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించుకునేందుకు అనుమతులు తీసుకోవాలని చిరువ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.



వారసంతలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు, మధ్యలో రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

నిర్వహణకు ఇబ్బంది



నేను సంతలో ప్రతివారం కూరగాయల దుకాణం నిర్వహిస్తుంటాను. రోడ్డుకు రెండువైపులా దుకాణాలు ఉండటంతో రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది అవుతోంది. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై నీరంతా కూరగాయలపై పడుతోంది.

– సాయన్న, కూరగాయల వ్యాపారి

సంతకు రావాలంటే భయం



సారంగపూర్‌లో వారసంతలోనే కూరగాయలు, ఇతర నిత్యావసరాలు కొనుగోలు చేస్తుంటా. కానీ రోడ్డుపై దుకాణాలు ఉండటంతో ఇబ్బంది అవుతోంది. వాహనాల కారణంగా సంతకు రావాలంటనే భయమైతంది.

– బేబీబాయి, రవీంద్రనగర్

మార్కెట్‌లో నిర్వహించాలి



సారంగపూర్‌లో రోడ్డుపైనే వారసంతను ఇరువైపులా నిర్వహించడంతో ప్రజలు, చిరువ్యాపారులు ఇబ్బంది పడుతుఅన్నరు. మార్కెట్ యార్డులో చాలా స్థలం ఖాళీగా ఉంది. వారసంతను ఆ మార్కెట్‌లో నిర్వహిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు.

– నవీన్, బోరిగాం

గురుపౌర్ణమికి ముస్తాబు

- నేడు ఆలయాలకు రానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



నిర్మల్‌లో ముస్తాబైన బాబా ఆలయం

నిర్మల్‌టౌన్: ఆషాఢమాసంలో పౌర్ణమినాడు జరుపుకొనే పండుగ గురుపౌర్ణమి. ఈ పౌర్ణమిని వ్యాస మహర్షి జన్మదినంగా, జ్ఞానం, ఆధ్యాత్మిక పురోగతికి ప్రతీకగా భావిస్తుంటారు. గురువులకు కానుకలు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. ఈరోజును చాలా మంది సాయిబాబాను గురువుగా భావించి పూజలు చేసి ఉపవాసం ఉంటారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని గండిరామన్న దత్తసాయి ఆలయాన్ని అలంకరించి ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బంది కల్గకుండా క్యూలైన్లు, సౌకర్యాలు కల్పిచారు. ఆలయ కమిటీ, దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున నుంచే బాబాకు పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

గండిరామన్న ఆలయంలో..

గురువారం ఉదయం 5:30 గంటలకు మంగళ స్నానం, క్షీరాభిషేకం, అర్చన, పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. 48 గంటల సాగిన సాయినామ పారాయణం ఉదయం 11:30 గంటలకు ముగిస్తారు. 12 గంటలకు హారతి నిర్వహించి, మహా అన్నదానం చేస్తారు. కమౌల్, చించాల, ఎడ్‌బిడ్, వెంకటాపూర్, నిర్మల్‌కు చెందిన భజన మండళ్ల సభ్యులు పాల్గొని భజనలు చేస్తారు. భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గంగోని బురాజ్ తెలిపారు.

వేడుకలు ప్రారంభం

కుంటాల:మండలంలోని కల్లూరు శ్రీదత్తవెంకట సాయి బాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి అఖండ సాయి నామస్మరణను ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నర్సాపూర్ (జి): మండలకేంద్రంలోని గొల్లమాడ రైతువేదికలో ఆయా గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అందజేశారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, మహేశ్, వినోద్ రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన కర్రెన్నకు రూ.16వేలు, లక్ష్మణ్‌కు రూ.18 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. బుధవారం దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వారికి చెక్కులు అందించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భోజారెడ్డి, భూమన్న, రాములు ఉన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసారూరల్: బాసర మండల కేంద్రానికి చెందిన సులోచనకు రూ.60 వేల విలువై సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. బుధవారం దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధిత కుటుంబీకులకు చెక్కు అందించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మిలింద్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆక్రమణలు తొలగింపు

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామంలో అనుమతులు లేకుండా సీసీ రోడ్డుపై చేపట్టిన నిర్మాణాలను పొక్లెయిన్‌తో పంచాయతీ అధికారులు , పోలీసుల సమక్షంలో తొలగించారు. ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారులు సంబంధిత ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసినప్పటికీ వారు స్పందించలేదు. దీంతో బుధవారం డ్రెయినేజీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న మెట్లను తొలగించారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

జింకపై కుక్కల దాడి

ముధోల్: మండలంలోని బ్రహ్మణ్‌గావ్ గ్రామ శివారులో బుధవారం జింకపై వీధికుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి డయల్ 100కు ఫోన్ చేయడంతో ఎస్సై బిట్లా పెర్సిస్ ఆధ్వర్యంలో పోలీస్ నారీశక్తి టీం తేజశ్రీ, విజేతలు ఘటన స్థలానికి వెళ్లి జింకను కాపాడారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి జింకను అప్పగించారు.

కళాశాల తనిఖీ

మామడ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డీఐఈవో పరుశురాం అన్నారు. బుధవారం మామడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్, అధ్యాపకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్

మామడ: ప్రత్యేక నిధులు మంజూరు చేయించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నల్దుర్తి గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రా రంభించారు. భవన నిర్మాణంతో సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు దూరం అయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బాపురెడ్డి, రంజిత్‌కుమార్, పడాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన బీఆర్‌ఎస్ నేతలు

సారంగపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారం తెలంగాణ ముఖచిత్రాన్నే మార్చిందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి అన్నారు. హరితహారం పదేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ పరిసరాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరితసేన కోఆర్డినేటర్ భోజ నారాయణ, దుబాయి రాజన్న, చిన్నారెడ్డి, సుధాకర్, అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్ తదితరులు ఉన్నారు.

దాత సహకారంతో రోడ్డు

కుంటాల: సారంగపూర్ మండలంలోని జామ్ గ్రామానికి చెందిన అల్లాడి కవిత–వెంకట నర్సయ్య దంపతులు కుంటాలలోని శ్రీ మహాలక్ష్మి ఆలయ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.లక్షను విరాళంగా అందజేశారు. బుధవారం రోడ్డు పనులను ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి

లక్ష్మణచాంద: లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీవో రాధ అన్నారు. బుధవారం మండలంలోని వడ్యాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారుల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. పూర్తయిన పనుల ఆధారంగా దశలవారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమవుతాయని పేర్కొన్నారు. పీఆర్ ఏఈ సంజయ్‌కుమార్, ఏఈ సంజయ్‌కుమార్, కార్యదర్శి రాజీవ్‌వర్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ కమల్

కుంటాల: కనిపించిన తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాలని తహసీల్దార్ కమల్ సింగ్ పేర్కొన్నారు. మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన లక్ష్మి.. కుమారులు తనను సరిగా చూసుకోవడం లేదని ఇటీవల భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ బుధవారం గ్రామానికి వచ్చి కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులను వేధిస్తే వయోవృద్ధుల సంక్షేమం చట్టం 2007 ప్రకారం.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని సూచించారు. మాజీ సర్పంచులు సవ్వి అశోక్ రెడ్డి, ఆనంద్ రావు పటేల్, గ్రామస్తులు ఉన్నారు.

పుట్టినరోజున మొక్క నాటాలి

నిర్మల్‌టౌన్: ప్రతి విద్యార్థి తన పుట్టినరోజున ఒక మొక్క నాటి సంరక్షించాలని నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ సూచించారు. జిల్లాకేంద్రంలోని కొండాపూర్‌లో శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని విద్యార్థులకు తెలిపారు. అనంతరం ఎంఈఓ నాగేశ్వరరావు , రూరల్ ఎస్సై లింబాద్రి, పాఠశాల ఏజీఎం అరవింద్‌రెడ్డి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ జగతిరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి సూర్యకిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

నిర్మల్ రూరల్: ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌక్ నుంచి వివేకానందచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. వివేకానందస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కన్వీనర్ మూడపెల్లి దినేశ్, న గర కార్యదర్శి సాయికుమార్, వంశీ, జగదీశ్, నవదీప్, గౌతమ్, గణేశ్, కార్తీక్, మల్లేశ్, సాత్విక్, బన్ను, సందీప్, అరుణ్, సుభాష్, అగస్త్య, గణేశ్ పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంలోని అభ్యాస గురుకుల ఉన్నత పాఠశాలలో బుధవారం ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయికుమార్ మాట్లాడుతూ ఏబీవీపీ ప్రస్తుతం 56 లక్షల మంది సభ్యులతో కొనసాగుతుందని పేర్కొన్నారు. హెచ్‌ఎం ప్రదీప్, మల్లేశ్, కార్తీక్, పూర్వ కార్యకర్త ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు

మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం

ఖానాపూర్: మహిళ సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గా భవాని అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్ ఎస్సీ కాలనీలో మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. నుస్రత్ ఫాతిమా, పరిమళ, కమల, శారద, గోదావరి, తదితరులు ఉన్నారు.

కడెం: మండలకేంద్రంలోని బృందావన్ రిసార్ట్స్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, బబ్లూ, శేఖర్, ప్రతాప్, ధర్మయ్య, మల్లయ్య, ఇస్రూ, గంగారాజం తదితరులున్నారు.



గాంధీనగర్‌లో కేక్ కట్ చేస్తున్న దుర్గాభవాని

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ పర్యటించారు. పద్మావతినగర్ కాలనీకి చెందిన కనకయ్య సోదరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న శివాజీనగర్ కాలనీకి చెందిన వార్డు మాజీ సభ్యుడు గోడాపూర్ గంగాధర్, బక్కన్నను పరామర్శించారు. ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, అనిల్‌రావు, భూమన్న, రమేశ్, సురేందర్, శ్రీనివాస్, సుధాకర్, సందీప్, రంజిత్, అజయ్ తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన ముంజ నడిపి నారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. బుర్ర సాయికుమార్‌గౌడ్, అరవింద్, గంగాగౌడ్, నరేశ్‌గౌడ్, తిరుపతి, రవి, ఉదయ్, మల్లికార్జున్ తదితరులున్నారు.

మలక్‌చించోలిలో ఎంపీ

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన దాసరి పోసవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు నరేశ్, విలాస్, తిరుమలచారి, ఆయా గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

ఆలోచింపజేసిన నాటిక



జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో బుధవారం 'బుద్ధుడితో నా ప్రయాణం ' పేరిట ప్రదర్శించిన నాటిక ఆలోచింపజేసింది.హైదరాబాద్‌కు చెందిన ఆర్ట్స్ అభ్యుదయ కళాబృందం అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిసేలా ప్రదర్శించిన నాట్య ప్రదర్శనను జిల్లా అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. కళాకారులు బుద్ధుడు, అంబేద్కర్ జీవిత చరిత్రలు ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ప్రశాంతంగా కార్మికుల సమ్మె



తానూరులో సమ్మెలో పాల్గొన్న కార్మికులు



లక్ష్మణచాందలో నినాదాలు చేస్తున్న కార్మికులు



భైంసాలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేతలు



ఖానాపూర్‌లోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో..



కడెంలో..



లోకేశ్వరంలో మానవహారంలో ఆశవర్కర్లు

తానూరు: కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్ల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పలు కార్మిక సంఘాల నాయకులు బుధవారం సమ్మెకు పిలుపునిచ్చారు. తానూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, పంచాయతీ సిబ్బంది, భోజన కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

కడెం: కార్మికుల హక్కులను కేంద్రం విస్మరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరి తిరుపతి అన్నారు. కడెంలో నిర్వహించిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కుంటాల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై అశోక్ చేరుకుని వారికి నచ్చజెప్పడంతో శాంతించారు.

లక్ష్మణచాంద: మండలంలో జరిగిన సమ్మెలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ సిబ్బంది, ఆశావర్కర్లు జగన్నాథ్‌రావు చౌరస్తాలో మానవహారం నిర్వహించారు.

ముధోల్: మండలకేంద్రంలో కార్మికుల ర్యాలీ ఐబీ నుంచి నయాబాది చౌరస్తా వరకు కొనసాగింది. సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు పోశెట్టి, వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

లోకేశ్వరం: ఆశవర్కర్లు మండలకేంద్రంలో ర్యాలీ తీసి భగత్‌సింగ్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. సంఘం మండలాధ్యక్షురాలు ఆనందకుమారి, గోదావరి, స్వప్న, మమత ఉన్నారు.

భైంసాటౌన్: నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకుడు రామ్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం నుంచి టిప్పు సుల్తాన్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు బక్కన్న, హమాలీ, పెయింట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, బీడీ కార్మికులు ఉనారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలో రహదారిపై కార్మిక సంఘాల నాయకులు నిరసన తెలిపారు. పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తానూరు: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై జుబేర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోలూరు గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు నోటీసులు అందజేశారు. పోలీస్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళాశక్తి సంబరాలు

లక్ష్మణచాంద: ఇందిరా మహిళాశక్తి సంబురాల్లో భాగంగా బుధవారం మండలంలోని ధర్మారంలో మహిళా సమాఖ్య సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మహిళా సా ధికారిత అభివృద్ధి, బీమా, శ్రీని ధి రుణాలు, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి క్రెడిట్ ప్లాన్, బ్యాంకు లింకేజి అచీవ్‌మెంట్, స్కూల్ యూనిఫాం తయారీ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సీసీ నరేందర్, వీవోఏ ప్రభాకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీఐ చట్టాల పుస్తకం అందజేత

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐ చట్టాలను వివరించే పుస్తకాన్ని తహసీల్దార్ సరితకు ఆర్టీఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్, సోఫీ ఇలియాజ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

ఖానాపూర్: పరిసరాల పరిశుభ్రత పాటించేలా కార్యదర్శులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని సింగాపూర్ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. రామకృష్ణ, కార్యదర్శి లావణ్య ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కుంటాల: మండలంలోని లింబా(కె) జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ కమల్ సింగ్ పరిశీలించారు. హెచ్‌ఎం సతీష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

అధిక డబ్బులు వసూలు చేయొద్దు

కుంటాల: వివిధ ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాలకు వచ్చే ప్రజల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కమల్ సింగ్ హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీటీ నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: మండలకేంద్రంలోని శ్రీమల్లన్న ఆలయ నిర్మాణం కోసం రూ.తొమ్మిది లక్షలు మంజూరవగా.. ప్రొసీడింగ్ కాపీని బుధవారం దేగాంలోని తన ఇంటిలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అందజేశారు. గొల్ల నర్సయ్య, రసూల్, భోజన్న, లక్ష్మణ్ ఉన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

ఖానాపూర్: రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ సిబ్బందితో జరిగిన త్రైమాసిక సమావేశంలో మాట్లాడారు. అనంతరం మంత్రి సీతక్క జన్మదినం పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ సయ్యద్ అజాం, డైరెక్టర్లు పులియానాయక్, నారాయణ, గంగాధర్, యాదగిరి, మహేందర్, జలజ, రాజన్న, నారాయణ, విఠల్ ఉన్నారు.

12న జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో ఈనెల 12న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో సమావేశంలో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడారు. 60కి పైగా కంపెనీలతో చేపట్టే జాబ్‌మేళాను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్, నాయకులు రాము నాయక్, రాజగంగన్న, రాజు, ఖలీల్, వాల్‌సింగ్, నరేందర్‌రెడ్డి, ప్రదీప్, శ్రావణ్, సుమన్, మురళి, రాకేశ్, సుమిత్, ప్రణీత్ తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

